ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

# కరోనా నేపథ్య కథలు – స్త్రీల పరిస్థితి చిత్రణ

**అప్పన్న ఇనపకుర్తి, పరిశోధకులు, తెలుగు విభాగం[1]**
ప్రభుత్వ డిగ్రీ కళాశాల( పురుషులు), అనుబంధం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం-శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్.
సెల్:9966338730,Email :appanna inapakurthi @gmail. Com.

**డాక్టర్. ఢిల్లీశ్వరరావు సనపల[2]**
పరిశోధన పర్యవేక్షకులు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు), అనుబంధం, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం.సెల్:944144208,Email: eswar.dilli820@gmail.com

Received: 5/07/2026
Article Accepted: 20/08/2026
Published Online: 23/08/2026
DOI:10.53414/Sahithyatharangini.2026.3.3.161

**వ్యాస సంగ్రహం :** ఆధునికాంధ్ర వచన సాహిత్య ప్రక్రియల్లో ఒకటైన కథానిక ప్రక్రియ నవలా ప్రక్రియ తర్వాత పాఠక సమాజాన్ని బాగా ఆకట్టుకున్న ప్రక్రియ అని చెప్పవచ్చు. తెలుగు వచన సాహిత్యంలో కథ ఒక విశిష్టమైన స్థానాన్ని సంతరించుకోవడమే కాకుండా ఆధునిక కాలంలో ఒక ప్రత్యేకమైన స్వరూపాన్ని కూడా సంతరించుకుంది. కథలంలో విభిన్న వస్తువులను తీసుకుని రాయడం పరిపాటి. ఈ నేపథ్యంలో విభిన్న వస్తు వైవిధ్యంతో కరోనా కాలంలో కథలు విలువడ్డాయి. ఈ కథలలో కరోనా లాక్డౌన్ సమయంలో స్త్రీలు ఎదుర్కొన్న అనేక రకాల సమస్యలు చిత్రించబడ్డాయి.. కుటుంబ బాధ్యతలు, ఉద్యోగ ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు వంటి అనేక విషయాలు కథల్లో దర్శనమిస్తాయి. వాటిని విశ్లేషించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశం.

**కీలక పదాలు:** లాక్ డౌన్, వర్క్ ఫ్రం హోమ్, ఆకలి, వలస జీవనం, ఆన్లైన్, కరోనా మహమ్మారి, సామాజిక దూరం, మాస్కులు, క్వారంటైన్, వలస కూలీలు, గృహిణిలు, గర్భిణీలు, స్త్రీల కష్టాలు.

**ఉపోద్ఘాతం** : కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. ముఖ్యంగా, కరోనా కాలంలో స్త్రీలు అనేక రకాల సమస్యలను ఎదుర్కొన్నారు.. ప్రాణి ఉనికికి కేంద్ర బిందువు

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

స్త్రీ. ఆమె లేనిది మనుగడేలేదు. కరోనాకాలంలో విధించిన లాక్ డౌన్ వల్ల స్త్రీలు అనేక విధాలుగా శారీరిక, మానసిక, సామాజిక, ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిల్లలకు ఆన్లైన్ క్లాసులు, పెద్దవాళ్లకు వర్క్ ఫ్రం హోం వంటి పనుల వల్ల, ఇళ్లల్లో పనిచేస్తున్న పని మనుషులను మాన్పించడంతో, గృహిణులు ఇంటి పనులు చేసుకోవడంలో సతమతమవుతూ ఆందోళన చెంది, ఒత్తిడికి గుర్తై అనారోగ్యం పాలయ్యారు. కొంతమంది స్త్రీలు వలస కార్మికులుగా పట్టణాల నుండి పల్లెలకు చేరేటప్పుడు మార్గమధ్యంలో దొంగతనాలకు, దోపిడీలకు, హత్యాచారాలకు బలైపోయారు. మరి కొంతమంది రుతుస్రావాలు జరిగి మరణించారు. గర్భిణీలు మార్గమధ్యంలో ఎటువంటి సౌకర్యాలు లేక ప్రసవన బాధను అనుభవించారు. పచ్చి బాలింతలకు సైతం నడకయాతన తప్పలేదు. ఉద్యోగం చేస్తున్న స్త్రీలు ఒక ప్రక్క ఉద్యోగం, మరొక ప్రక్క కుటుంబ బాధ్యతలతో సతమతమయ్యారు. వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర సేవా రంగాల్లో పనిచేసే మహిళలు సమాజానికి విశేష సేవలు అందించారు. కరోనా నేపథ్య కథలలో స్త్రీలు పరిస్థితులను చిత్రీకరిస్తున్న దీవ్యాసం.

**స్త్రీల పరిస్థితి చిత్రణ:** కరోనాకాలంలో లాక్ డౌన్ వల్ల పాఠశాలలు, ఆఫీసులు మూతపడటం, ఇళ్లకే పరిమితం కావడం, పనిమనుషులు రాకపోవడంతో వంటతోపాటు, శుభ్రం చేయడం వంటి ఇంటి పనులభారం పూర్తిగా మహిళలపై పడింది. ఉద్యోగినులు ఇంటి పని, కార్యాలయాలు పనులు చేయలేక మానసికంగా ఒత్తిడికి గురైన సన్నివేశాలు స్పష్టంగా కథల్లో కనిపిస్తుంది. గృహిణుల పరిస్థితి, రోజు కూలిలైన స్త్రీల పరిస్థితి, ఉద్యోగినులపరిస్థితి, వలస కూలిలైన స్త్రీల పరిస్థితి, వృద్ధ-ఒంటరి మహిళల పరిస్థితి చిత్రణ వంటి వస్తువుతో కూడిన కథలు వెలుపడ్డాయి.

**గృహిణుల పరిస్థితి:** కరోనాకాలంలో లాక్ డౌన్ వల్ల కుటుంబ సభ్యులందరూ ఇంట్లో ఉండడం కారణంగా వారికి సపర్యలు అందించడంతోపాటు, పాఠశాలలు, కళాశాలలు మూసివేయడంతో పిల్లలకు ఆన్లైన్ విద్యను అందించడంలో వారికి అవసరమైన సహాయం చేయడంలో అదనపు బాధ్యతలు పెరిగాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులు, కుటుంబ ఆదాయం తగ్గిపోవడం, వైరస్ సోకుతుందనే భయం వంటి పరిస్థితుల వల్ల విశ్రాంతి లేక నిరంతర పనిభారం కారణంగా శారీరిక అలసట, మానసిక ఒత్తిడి పెరిగి అనారోగ్యానికి గురైన పరిస్థితులను చూడవచ్చు.

గట్టు రాధికా మోహన్ రాసిన "కొంచెం రెస్ట్ కావాలి" కథలో లాక్ డౌన్ మూలంగా హాస్టల్ మూసివేయడంతో ఇంట్లో ఉండే పిల్లలు కూడా అతిథులుగా మారిపోవడం, పనిమనిషి రాకపోవడం, పొద్దస్తమానం టీవీ, ఫోన్ చూసుకోవడమే తప్ప వేరే పని చేయకుండా కుటుంబ యజమాని ఉండటంతో

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

ఇంటి పని భారమంతా గృహిణి పై పడి అవిశ్రాంతిగా పనిచేయడం వల్ల ఆమె శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతూ స్పృహ తప్పి పడిపోయిన సంఘటనను ఈ కథలో చూడవచ్చు. కవిత గృహిణి. ఆమె భర్త అరుణ్. వీళ్ళ పిల్లలు సన్నీ, రీతు లాక్ డౌన్ వల్ల హాస్టల్ మూసివేయడంతో ఇంటికి అతిధులుగా మారారు. పనిమనిషి రావట్లేదు, భర్త అరుణ్ పొద్దస్తమానం టీవీ, ఫోన్లలో మునిగిపోతాడు. ఎవరూ కవితకు ఏ పని సహాయం చేయరు కానీ తినడానికి కావలసిన పదార్థాలుకు మాత్రం ఆర్డర్లు జారీ చేయడానికి ముందంజలో ఉంటారు. వాళ్ల మీద ప్రేమతో కవిత ఉదయం నుండి రాత్రి పడుకునే వరకు పనిచేసి అలసటకి గురైన పరిస్థితిలో బాధపడుతూ ఇంట్లో ఉన్న పిల్లలు, భర్త పట్ల ఆమె మనోభావాన్ని ఇలా వ్యక్తం చేసింది. " వీళ్ళు ముగ్గురు కూడా నాకూ, నా సహనానికి పరీక్ష పెడుతున్నారు. ఏమాత్రం నన్ను అర్థం చేసుకోకుండా, రోబో కైనా కొంత సమయం దొరుకుతుంది చార్జింగ్ చేసే సమయంలో, కానీ నాకు మాత్రం దొరకట్లేదు". ( కొంచెం రెస్ట్ కావాలి- పుట-372) అంటూ కరోనా వల్ల బాధ కంటే కుటుంబీకుల వల్ల బాధ ఎక్కువై వుతున్న పరిస్థితి ఆమెలో స్పష్టంగా గోచరించెను. రెండు నెలలు పూర్తి అయ్యేసరికి ఆరోగ్యం సర్వస్వాన్ని కోల్పోయింది కవిత. " సమయానికి తినాలనే ఆలోచన కూడా రాకపోయేది. ఒంట్లో నలతగా ఉండటం, అతిగా చెమటలు పట్టడం, కడుపులో మంట మొదలైంది. నాలోని చురుకుదనాన్నంతా ఎవరో నమిలి పడేసినట్టనిపిస్తుంది". ( కొంచెం రెస్ట్ కావాలి- పుట-(373 ) అని తాను పడిన బాధను భర్త, పిల్లలకు కూడా చెప్పకుండా పంటి బిగువున పెట్టి అనుభవిస్తున్నది. భర్త అరుణ్ మాత్రం కవిత యొక్క శారీరక, మానసిక స్థితిని ఏమాత్రం పట్టించుకోడు. దీనంతటినీ భరిస్తున్న ఆమె ఒకరోజు పనులు చేస్తుండగా స్పృహ తప్పి పడిపోయింది. ఇలా కరోనా లాక్ డౌన్ కాలంలో గృహిణులు పని భారంతో ఒత్తిడికి గురై ఆరోగ్య సమస్యలతో బాధపడ్డారని చెప్పడానికి ఈ కథ ఒక చక్కటి ఉదాహరణ.

పెయ్యేటి శ్రీదేవి రాసిన "కరోనాకాలం" కథలో కరోనా లాక్ డౌన్ కారణంగా పనిమనిషి మీద ఆధారపడి ఇంటి పనులు చేసుకుంటున్న వాళ్లకి, పనిమనిషి రాకపోవడంతో ఇంటి పనినంతటినీ గృహిణులు( యజమానురాలు ) చేసుకోవడానికి ఇబ్బంది పడే సమయంలో పెళ్లి కోసం వచ్చిన చుట్టాలు కూడా పెళ్లి వాయిదా పడటంతో ఇంటికి వచ్చి తిష్ట వేయడంతో 'మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా'మారిన గృహిణుల పరిస్థితిని చక్కగా చిత్రీకరించింది. ప్రశాంతి, సునంద అక్కాచెల్లెళ్లు. ప్రశాంతి ఇంటికి చుట్టరికానికి వచ్చిన సునంద పనమ్మాయితో గొడవపడడం వల్ల ఆమె పనిమానేసింది. దీంతో ఇంటి పని వంట, వార్పు,శుభ్రం చేసుకోవడం వంటి పనులతో సతమతమౌతుంది ప్రశాంతి. ఆమె పిల్లలు కూడా ఇల్లు పీకి పందిరేసే రకం కావడంతో మరింత శ్రమ పడాల్సిన పరిస్థితి. ఇంతలో చుట్టం చూపుగా వచ్చే చుట్టాలు కూడా

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

ఇంట్లో తిప్ప వేశారు. వాళ్లందరికీ సేవ చేసిన ఆమెకు ఆరోగ్యం చెడిపోయినా పట్టించుకోకుండా తిరిగి వంపులు పెట్టే పరిస్థితులు ప్రశాంతికి ఎదురవుతాయి. " ఒంట్లో బాగుండకపోయినా... చేసి చేసి అలసిపోయి, కాసేపు పడుకున్నా ఎవరికీ అక్కర్లేదు. ఇల్లు నీటుగా లేదని... వంట బాగాలేదని... మొగుడనే మగాడు కూడా భార్యనే తిడతాడు". ( కరోనాకాలం -పుట- 347) ఈ మాటల్లో కరోనాకాలంలో స్త్రీలు ఎదుర్కొన్న పరిస్థితులు బహు చక్కగా కనిపిస్తాయి. ఈ సందర్భంలో పెళ్లికి వచ్చిన వాళ్ళు ఇంకెవరైనా వస్తారేమోనన్న భయానికి 'దయచేసి మా ఇంటికి రాకండి' అన్న బోర్డు కూడా తగిలించింది గేటుకి ప్రశాంతి. ఈ మాటల్లో గృహిణులు ఎదుర్కొన్న మానసిక స్థితి స్పష్టమవుతుంది. ఇలా తన ఇంట్లో గందరగోళాన్ని భరిస్తూ... "ఇహ ఉదయం లేచింది మొదలు ప్రశాంతికి పొద్దున్న టిఫిన్లు, కాఫీలు, భోజనాలు, మళ్లీ సాయంత్రం స్నాక్స్, టీలు అందరికీ అందిస్తూ వండి వడ్డించేసరికి నడుం పడిపోతుంది. భరించడం కష్టమే. భర్త శంకరానికి ఆఫీస్ బంద్. వచ్చే నాలుగు అంకెల కొద్దిపాటి జీతంలో సగం కోత కోసే ప్రభుత్వాలు. ఏవి బందయినా తినే తిండికీ, తన చాకిరీకి మాత్రం బందు లేదు". ( కరోనాకాలం -పుట- 348) ప్రశాంతి నిలయం కాస్త అశాంతిని నిలయంగా మారిందనే చెప్పాలి. ఆర్థికపరమైన ఒడుదుడుకులను చూసుకుంటూ ఇళ్లల్లో శక్తికి మించిన పనులు చేసుకోలేక, విశ్రాంతి లేక శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురై అనారోగ్యం పాలైన పరిస్థితులు ఈ కథలో ప్రశాంతి పాత్రలో స్పష్టంగా కానవస్తాయి.

**వలస కూలీలైన స్త్రీల పరిస్థితి**: పల్లెల నుండి బతుకుతెరువు కోసం పట్టణాలకు పొట్ట చేతపట్టుకొని వెళ్లిన వలస కూలీలు కరోనా లాక్డౌన్ వల్ల పనులు నిలిపివేయడంతో చేసేదేమీ లేక నిస్సహాయ స్థితిలో తిరిగి పల్లెబాట పట్టి, రవాణా సౌకర్యం లేక, నడక మార్గంలో ప్రయాణం చేస్తున్నప్పుడు మార్గమధ్యంలో స్త్రీలను అనేక కష్టాలంు అలుముకుని వారిని నిలువునా కృంగదీసిన పరిస్థితులు కరోనా నేపథ్య కథలలో సాక్షాత్కరిస్తాయి. లాక్ డౌన్ కాలంలో వలస వెళ్లిన స్త్రీలు గర్భిణీలుగా ఉన్నవారి సహితం రవాణా సౌకర్యం లేక నడక తప్పలేదు. కొందరికి నవమాసాలు నిండి కాన్పులు మార్గమధ్యంలో అయ్యే పరిస్థితులను చూడవచ్చు. గర్భిణీలు ప్రసవానికి సౌకర్యం లేక పురిటి నొప్పులను భరిస్తూ రోడ్డు ప్రక్కనున్న టీ కొట్టులో మంత్రసాని సహాయంతో ప్రసవనలు జరిగే పరిస్థితులకు ఉదాహరణగా శారదా శ్రీనివాసన్ రాసిన " ఊరట" కథలో చూడవచ్చు. నూకాలు, సింహాచలం దంపతులు శ్రీకాకుళం నుండి తెలంగాణకు వలస వెళ్లారు. భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సమయంలో కరోనా వల్ల లాక్ డౌన్ విధించి, బిల్డింగ్ పనులన్నీ ఆగిపోవడంతో వలస కూలీల బతుకులు దుర్భరంగా మారిపోయాయి. దీంతో పట్టణాల్లో జీవనోపాధిని కోల్పోయి పల్లె బాట పట్టారు అందరూ. రవాణా సౌకర్యాలు లేవు. నడక ప్రయాణం చేయడానికి

సిద్ధమైన నూకాలు, సింహాచలం కూడా బైలెల్లినారు. కానీ నూకాలు మాత్రం " తనిప్పుడుత్త మనిషి కూడా కాదు. ఏడో నెల నడుస్తుంది. చేతిలో ఎర్రని ఏగానీ కూడా లేదు. ఎండలు మండిపోతున్నాయి. పెనిమిటి చెంబు, తప్పేలా,చాప, కుక్కి మంచం మోస్తున్నాడు. తను కడుపులో బిడ్డను, సంకలో కుర్రాన్ని మోస్తున్నది". ( ఊరట- పుట-94 ) సాధారణంగా ఆ సమయంలో స్త్రీలు వాళ్లు నడవడమే కష్టం కానీ సంకలో బిడ్డతో మైళ్ళ దూరం నడవడమంటే సాహస కృత్యమే. ఆకలి మంటలకు మంచినీళ్ళతో కడుపును మంచి చేసుకుంటుంది. నడవలేకపోతున్నది. ఆమె కాళ్లు తడబడుతున్నాయి. తాను బయలుదేరి ఎన్నాళ్ళు అయిందో కూడా తెలియదు. అది ఏ ఊరు కూడా తెలియదు. ఈ స్థితిలో ఉన్నట్టుండి పురిటినొప్పులు మొదలయ్యాయి నూకాలకు. ఎటూ పోలేని పరిస్థితిలో భర్త సిమ్మాచలం.... " రోడ్డు పక్కన టీ షాప్ వెనకగా నులక మంచం అడ్డంపెట్టి చుట్టుగా చీర కట్టాడు. ఇంతలో ఆ టీ కోట్లు టీ తాగడానికొచ్చిన ఓ దయగల తల్లి ' నూకాలమ్మ దేవతలా' సాయానికొచ్చింది. ఆమే పురుడు పోసి, పిల్లాడికి నీళ్లు పోసి తుడిచి చేత బెట్టింది". ( ఊరట- పుట – 94) ఇలా కరోనాకాలంలో ఎంతోమంది గర్భిణీలు ఎన్నో అసాధారణ పరిస్థితులను ఎదుర్కొనే తీరు నూకాలు పాత్రలో కంటికి కట్టినట్లుగా చిత్రీకరించారు రచయిత.

కడెం లక్ష్మీ ప్రశాంతి రాసిన " అస్తమయం" కథలో ఉన్న ఊరిలో బ్రతుకుతెరువు లేక జీవనోపాధిని వెతుక్కుంటూ పల్లె నుండి పట్నానికి వలస వెళ్లి భవన నిర్మాణ కార్మికులుగా పనులు చేస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు నిస్సహాయ స్థితిలో కుటుంబ భారాన్ని నెత్తిన పెట్టుకొని వారిని పోషించడానికి వలస జీవులుగా స్త్రీలు ఎదుర్కొన్న విభిన్నమైన పరిస్థితులను బహు చక్కగా చిత్రీకరించారు. కుటుంబ పోషణకై కన్నబిడ్డలను సైతం సొంత ఊరులో ఉంచి పల్లె నుండి పట్నానికి వలస బాట పట్టారు రంగడు, భూదేవి దంపతులు. అక్కడ భవన నిర్మాణ కార్మికులుగా ఉపాధి పొందిన కొంతకాలానికి బిల్డింగ్ మీద నుండి ప్రమాదవశాత్తుపడిన రంగడు నడుం విరిగి జీవచ్ఛవంలా మారడంతో, కుటుంబ భారమంతా భూదేవి నెత్తిన పడింది. భూదేవి కష్టాన్ని నమ్ముకున్న వ్యక్తి. తన రెక్కల కష్టంతో పిల్లలను, భర్తను, అత్తను పెంచుకోవాలన్న దృఢ నిశ్చయంతో తన పనిని తాను చేసుకున్నప్పటికీ ఒంటరి మహిళ కావడంతో 'ఇల్లు కాలి ఒకడు ఏడుస్తుంటే చుట్టకి అగ్గి దొరికిందని మరొకడు సంబరపడినట్లు' కొందరు కామాంధుల వేధింపులకు గురికావాల్సి వచ్చింది. " పనిచేసే దగ్గర ఇద్దరు పోకిరీలు భూదేవితో అసభ్యంగా ప్రవర్తించబోతే చెప్పుతో బుద్ధి చెప్పింది. మేస్త్రి ఫోన్ తీసుకుని జరిగిందంతా ఆడపడుచు మల్లితో చెప్పాక కానీ ఆమె మనసు శాంతించలేదు". ( అస్తమయం-పుట -476) కరోనా విజృంభించడంతో లాక్ డౌన్ విధించింది ప్రభుత్వం. పనులు లేక ఆకలి మంటలతో ఉన్న వలస కూలీలకు మరల సొంతూరే దిక్కుగా మారి, తిరిగి

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

ప్రయాణమై రవాణా సౌకర్యాలు లేక కాలినడకన అందరూ ప్రయాణమయ్యారు. భూదేవి కూడా బయలుదేరింది కానీ సరిగ్గా ఆమె నెలసరిలో ఉంది. ఇంటి దగ్గర ఉన్న కుటుంబీకులను( పిల్లలు, భర్తను ) తలచుకుంటూ ఎలాగైనా గమ్యానికి చేరుకోవాలన్న తపనతో నడుస్తుంది. "భూదేవికి బహిష్టప్పుడు ఎక్కువ రక్తం పోతుంది. ఆ సమయంలో కడుపులో నొప్పి, నడుంనొప్పి రాత్రంతా నడవడంతోపాటు దారంతా వాంతులతో తెల్లారేసరికి అలసిపోయింది. తన అలసటను బయటకు తెలియనీయకుండా ఆకలి దప్పులు మరచి నడుస్తుంది. రక్తంతో తన లంగా అంతా తడిచిపోయింది. కన్ను పొడుచుకొని చూసిన మరుగు కనిపించలేదు. ఆమె ధ్యాసంతా పిల్లల మీదే". ( అస్తమయం-పుట -477) స్త్రీలకు ఇంతకన్నా కష్టాలు ఉండవేమోనన్న పరిస్థితుల్లో ఉంది భూదేవి. ఋతు స్రావాన్ని సైతం లెక్కచేయకుండా పిల్లలను చూసే వరకు నడక ఆపకూడదని దృఢ నిశ్చయ ంతో నడుస్తుండగా...."ఒంట్లో సత్తువ ఇంకిపోతుంది. శరీరం తూలిపోతుంది. అయినా సరే ఆమె నడక మాత్రం ఆపలేదు. రెండు రాత్రులు, రెండు పగళ్లు సుదీర్ఘ నడక తర్వాత ఆమె నేల మీద ఒరిగిపోయింది". ( అస్తమయం – పుట-478) ఆడబిడ్డ మల్లి, సీతారాములు ఎంత పిలిచినా ఉలుకు పలుకు లేదు. మనసులో తన కుటుంబ నేపథ్యానంతటినీ తలుచుకుంటున్న భూదేవికి "తన ఊపిరాగిపోతుందనే విషయం అర్థమౌతుంది. ఆమె కళ్ళ ముందు పిల్లలు, భర్త, అత్త నీడల్లా మెదులుతున్నారు. తన వారి లోకంలో ఆమె ఉండగానే భూదేవి ప్రాణం ఆమెను విడిపోయింది". ( అస్తమయం- పుట-478) వలస కూలీలుగా జీవనం సాగిస్తున్న మహిళలు కరోనా కారణంగా పట్టణాల నుండి సొంతగూటికి చేరుకుంటున్న సమయంల ో అసౌకర్యం, ఆకలితో బిడ్డలకు దూరమైన తల్లుల యొక్క హృదయవిధారక సన్నివేశాలను తెలుసుకొనుటకు ఈ కథ ఒక చక్కటి ఉదాహరణగా పేర్కొనవచ్చు.

**ఉద్యోగినుల పరిస్థితి** : కరోనాకాలంలో లాక్ డౌన్ యొక్క ప్రభావం ఉద్యోగినులైన స్త్రీలపై మరింత తీవ్రంగా పడింది. కార్యాలయాలు మూసివేయడంతో చాలామంది ఇంటి నుంచే (వర్క్ ఫ్రం హోమ్) పనిచేయాల్సి వచ్చింది. దీనివల్ల ఉద్యోగ బాధ్యతలతో పాటు ఇంటి పనులు, పిల్లల సంరక్షణ,వృద్ధుల సేవ వంటి వాటితో పాటు కుటుంబ సభ్యులు అనుమానాలను కూడా భరించాల్సిన పరిస్థితులు అగుపిస్తాయి. డాక్టర్ సమ్మెట విజయ రాసిన "వర్క్ ఫ్రం హోమ్" కథలో లాక్ డౌన్ కాలంలో ఉద్యోగాలు చేస్తున్న మహిళలు అటు ఆఫీసు పనులు, ఇటు ఇంటి పనులు చేసుకోలేక ఎంతగానో సతమతమౌతూ శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురైన పరిస్థితులను చూడవచ్చును. లాక్ డౌన్ మూలంగా ఆఫీస్ మూసేయడంతో ఇంటి దగ్గరుండి వర్క్ ఫ్రం హోం చేస్తుంది నిర్మల. పనిమనిషి రాకపోవడంతో ఇంటి పనంతా తానే చేసుకోవలసిన పరిస్థితి. దానికి

తోడు పిల్లలు, అత్తగారి సంరక్షణ కూడా తానే చూసుకోవాలి. కార్యాలయానికి వెళ్తే కనీసం ప్రయాణంలోనైనా విశ్రాంతి ఉంటుంది కానీ ఇంటి దగ్గర నుండి పనిచేయడం వాష్ రూమ్ కి కూడా వెళ్లడానికి అవకాశం లేకుండా అవిశ్రాంతంగా పనిచేయాల్సిన పరిస్థితిని ఆడపడుచు సరితకు ఫోన్లో ఏకరువు పెట్టిన సందర్భం… "వర్క్ ఫ్రం హోం అన్నప్పటినుంచి రాని పనిమనిషి పని, వంట పని ముగించుకుని లాప్టాప్ ముందు కూర్చోవడం. గంటలు గంటలు పనిలో లీనమవడం. ఆఫీసులో కాస్త బ్రేక్ తీసుకుని ఒకసారి ఇలా తిరగడానికి ఉండేది. ఇక్కడ లేచినా మరో పని తయారు గా ఉంటుంది. ఎలాగూ లేచావు కాస్త కాఫీ ఇవ్వవూ అనే భర్త, కొంచెం అన్నం పెట్టేస్తావా అనే అత్తగారు, అమ్మ ఇది నాతో గొడవ పడుతుంది నువ్వు రా అని తగువు తీర్చమని పిల్లలు". ( వర్క్ ఫ్రం హోమ్ -పుట-176) ఇలా క్షణం విశ్రాంతి లేకుండా పొద్దస్తమానం గడిపిన తీరును చూస్తుంటే ఉద్యోగినులు అనుభవించే శారీరక, మానసిక ఒత్తిడి తేటతెల్లమౌతుంది. ఈ కథలో నిర్మల పరిస్థితి ఒకటైతే, కావ్య పరిస్థితి మరొకటి. సరిత వాళ్ళ అపార్ట్మెంట్లో అద్దెకు ఉంటున్న కావ్య కూడా ఉద్యోగిని. ఆమె కూడా ఆన్లైన్లో వర్క్ ఫ్రం హోం చేస్తుంది. అక్కడ అవసరాన్ని బట్టి కార్యాలయ సిబ్బందితో మాట్లాడడం తన భర్త నవీన్ ఆమె పట్ల అనుమానంగా ప్రవర్తించి వేధించడం ప్రారంభించాడు. ఆన్లైన్ వర్క్ చేస్తున్న మహిళలు కుటుంబ వేధింపులకు గురయ్యారని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. " నేను లాప్టాప్ తీయగానే నన్ను అదే పనిగా గమనించి పిల్లలు పడుకోగానే… నువ్వెవరితో మాట్లాడావు? వాడెవడు? ఆ శరత్తో ఏంటి, ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నావు? మధ్యలో నవ్వుతున్నావు. రోజూ ఆఫీసుకు పోయి నువ్వు చేసేది ఇదేనా అవునవును అందుకే కదా మంచిగా తయారైపోయే దానివి…!"( వర్క్ ఫ్రం హోమ్-పుట-178) కుటుంబ పోషణ బాధ్యతను తీసుకొని మరింత శ్రమకు ఓర్చి పని చేస్తున్న స్త్రీలకు ఇంటి దగ్గర నుండి ఆన్లైన్ వర్క్ చేయడం భర్తలు అనుమానాలతో వేధింపులకు గురైన సన్నివేశాలను కూడా ఉన్నాయని చెప్పడానికి ఈ కథలో కావ్య పాత్ర ఒక చక్కటి ఉదాహరణ.కథలో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్న తరుణి కూడా వర్క్ ఫ్రం హోమ్ వల్ల స్త్రీలు పడే పాట్లును వాళ్ళ అమ్మమ్మతో చెప్పుకుంటూ…. " ఆఫీసులో అయితే మధ్యమధ్య బయట కాస్త క్యారెట్ జ్యూస్, గ్రీన్ టీ అవి తాగే దాన్ని… ఇప్పుడు వర్క్ ఫ్రం హోం పేరుతో నేనూ, గౌరవ్ చెరొక రూమ్ లో పనులు చేస్తున్నామా.. మధ్యలో లేచి నేను చేసుకోవాలి, గౌరవకి ఇవ్వాలి. మా కంపెనీ క్లయింట్స్ తో కాల్స్ ఒకదాని తర్వాత ఒకటి. మరి కాస్త వర్క్ పెంచారు. ఒక్కొక్కసారి లేచి వాష్ రూమ్ కి కూడా వెళ్లలేని పరిస్థితి".(వర్క్ ఫ్రం హోమ్ -పుట-179) అంటూ తరుణి చెప్పిన మాటల్లో ఇంటి దగ్గర నుండి ఆన్లైన్ వర్క్ చేస్తున్న స్త్రీలు ఒక ప్రక్క ఆఫీసు పని, మరొక ప్రక్క ఇంటి పని

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

చేస్తూ విశ్రాంతి లేక మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురైన సన్నివేశాన్ని బహు చక్కగా చిత్రీకరించారు రచయిత్రి.

**రోజు కూలీలైన స్త్రీల పరిస్థితి :** కరోనా కాలంలో దినసరి కూలీలైన స్త్రీలు ఆర్థిక, సామాజిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లాక్ డౌన్ కారణంగా పనులు పూర్తిగా నిలిపివేయడంతో ' రెక్కాడితే గాని డొక్కాడని' రోజువారీ కూలీలకు ఆదాయం లేకుండా పోయింది. దాంతో కుటుంబ పోషణ, పిల్లల అవసరాలు, అనారోగ్య కష్టాలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురైన సన్నివేశాలు కరోనా నేపథ్య కథలలో అగుపించెను. డాక్టర్ అడువాల సుజాత రాసిన " లాక్ డౌన్ కష్టాలు" కథలో కరోనా వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వం లాక్ డౌన్ విధించడంతో ముఖ్యంగా ఇళ్లల్లో పనిచేస్తున్న రోజువారి కూలీలైన స్త్రీలను పనికి రానివ్వకుండా నిలిపివేయడంతో వారు జీవనోపాధిని కోల్పోయి, కుటుంబాన్ని పోషించుకోలేక పడే ఇక్కట్లను బహు చక్కగా చిత్రీకరించింది. పనిమనిషి రాకపోవడంతో ఇంటి యజమానురాలు( గృహిణి ) పడే పాట్లు కూడా బహు చక్కగా ఈ కథలో కానవస్తాయి. సుగుణ మంచి గృహిణి. ఆమె ఇంట్లో పనిమనిషి మంగమ్మ. కరోనా విస్తరణకు పని మనుషులు కారణమవుతున్నారన్న నేపథ్యంలో వారిని ఇంటి పనులకు రానివ్వకుండా నిలిపివేశారు ఇంటి యజమానులు. కరోనా వల్ల ఇబ్బంది కంటే పనిమనిషి రాక గృహిణులు పడేపాట్లు వర్ణనాతీతం. ఇంటి పనంతా తానే చేసుకోవడంతో నడుంనొప్పి, మోకాళ్ళ నొప్పులు ఎక్కువవుతున్నాయి అనుకుంటూ సుగుణ, మంగను తలుచుకోగానే ఇంటి పనుల్లేకపోవడంతో తినడానికి కూడా ఇబ్బంది పడుతున్న మంగ ప్రత్యక్షమైంది. మంగ భర్త ఆటో నడుపుతారు. ప్రమాదవశాత్తు ఆయనకు నడుంవిరిగింది. హాస్టల్స్ మూసివేయడంతో పిల్లలు ఇద్దరు ఇంటికి వచ్చారు. భర్తకు ఆపరేషన్ చేయించాలి. ఈ పరిస్థితిని చూస్తే ' ముల్లే నక్కమీద తాటికాయ పడ్డ చందంగా' ఉంది మంగ దుస్థితి. తినడానికి తిండిలేని సందర్భంలో ఇలాంటి కష్టాలు అలుముకోవడం నిజంగా రోజువారీ కూలీలకు విధి వక్రీకరణే అని చెప్పాలి. ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఇంటి ఓనర్ సుగుణ వద్దకు వెళ్లిన మంగ తన బాధనంతటనీ మొరపెట్టుకుంటూ... "అమ్మ! మాయదారి కరోనా అచ్చి అందర్నీ అతలాకుతలం జేత్తుందమ్మా. ఆటో నడుత్తలేదు. చేతల ఒక్క రూపాయి లేదు. మా బిడ్డలిద్దరూ హాస్టల్ కెల్లి ఇంటికచ్చిండ్రు. ఆల్లకు హాస్టల్లనే కడుపునిండా తిండి దొరికింది. రోజు ఒక గుడ్డు, పాలు అన్నీ పెడుతుండ్రుట. ఇక్కడ మా ఇంట్ల రెండు పూటల తిండి పెట్టుడే కష్టమైతాంది. ఇప్పుడు నేను ఈ పిల్లలను ఆయనను ఏంజేసి, ఎట్లజేసి సాకాల్నమ్మా! అని శోకాలు తీసింది మంగ". (లాక్ డౌన్ కష్టాలు- పుట- 380) ఆమె మాటల్లో దినసరి కూలీలైన వారి ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా కనిపించును. మంగ కుటుంబాన్ని అలుముకున్న కష్టాలు సుగుణ కళ్ళ ముందు మెదలాడటంతో,కళ్ళల్లో

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

నీరు తిప్పుతూ కరోనా వల్ల సగటు వ్యక్తి అనుభవిస్తున్న జీవన వెతలు గురించి " కరోనా కలి భూతం ఎంతమందిని బాధపెడుతుంది. ముఖ్యంగా ఈ కరోనా విపత్తు వల్ల పురుషులు కంటే స్త్రీలే అధికమైన కష్టాలకు గురి అవుతున్నారనేది సత్యమై నిలిచింది. ఏ నిరుపేద కుటుంబంలో చూసినా పిల్లలు బాధ్యత తండ్రి కంటే తల్లి పైనే ఎక్కువ పడుతుందనేది వాస్తవంగా చెప్పవచ్చు.(లాక్ డౌన్ కష్టాలు- పుట- 381) లాక్ డౌన్ వల్ల అందరి ఇళ్లల్లో కూడా స్త్రీలు ఇంటిపని, వంటపనితో అష్టావధానం, శతావధానం చేస్తున్నారు. చాకరీ అనే ఇనుప పాదాలు కింద నలిగిపోతున్నారు. ఈ పరిస్థితులు మారేదెప్పుడు, ఈ వెట్టిచాకిరీ తప్పేదెప్పుడు, లాక్ డౌన్ లో ఎంతమంది స్త్రీలు పురుషుల ఆగడాలకు బలి అవుతున్నారు ఇట్లా అనేక ఆలోచనలు సుగుణ మనసులో తిరుగుతున్నాయి. (లాక్ డౌన్ కష్టాలు-పుట-382) కరోనా కాలంలో ఈ విధంగా పని నిలిపివేయడంతో ఆర్థికంగా మంగ, పనులు చేసుకోలేక అనారోగ్యంతో సుగుణ బాధపడే తీరు వర్ణనాతీతం. మంగ వంటి రోజువారి కూలీలైన ఎంతోమంది మహిళలును కష్టాలు అలుముకున్నాయని చెప్పడానికి ఈ కథ ఒక చక్కటి ఉదాహరణ.

డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ రాసిన ' దుఃఖ నది' కథలో వలస కార్మికులుగా రోజువారి కూలీలైన మహిళలు తమ కుటుంబాన్ని పోషించుకోవడం కోసం పడే వేదన కనిపిస్తుంది. బతుకుతెరువు కోసం పిల్లలను అత్త దగ్గరుంచి భర్త నాగన్నతో వలస వెళ్లింది శాంతమ్మ. కరోనా రావడంతో పనులన్నీ మూతబడ్డాయి. తిరిగి సొంతూరికి ప్రయాణమై వాహనాలు లేక కాలినడకన వస్తుండగా కాళ్లు బొబ్బలెక్కి రక్తాలు కారుతుండగా, ఆకలితో అలమటిస్తూ మార్గమధ్యంలో ఒకరోజు రాత్రి నాగన్న ప్రాణాలు విడిచినప్పుడు శాంతమ్మ విలపిస్తున్న సందర్భం హృదయవిదారకమైనది. " ఏమయ్యా... ఏమయ్యా!అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరిచింది శాంతమ్మ, శవాన్ని ఒడిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ రోధించింది ఒంటరిగా".( దుఃఖనది -పుట-51) ఈ సమయంలో శాంతమ్మ కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ అనుభవించిన బాధ వర్ణనాతీతమనే చెప్పాలి. భర్తను పోగొట్టుకున్న శాంతమ్మ పిల్లలను ఎలాగైనా చేరుకోవాలన్న దృఢ నిశ్చయంతో.... "దారిలో ఎన్నో దుఃఖ నదులను దాటుకుంటూ ఐదు రోజులు నడిచి రోడ్డంతా తన పాదముద్రలతో అరుణ వర్ణాలను అద్దుతూ సొంత గ్రామానికి చేరుకుంది. కరోనా టెస్టులు చేసి అధికారులు నెగిటివ్ అని రాగానే ఇంటికి పంపించారు". (దుఃఖనది- పుట -52) అంత దుఃఖభారాన్ని మోస్తూ బక్క చిక్కిన శవంలా ఇల్లు చేరిన శాంతమ్మ ఆకలితో ఆలమటిస్తున్న పిల్లలకు పుస్తెలతాడు అమ్మి, వచ్చిన డబ్బుతో నిత్యవసరాలుకొని వంట చేసి అత్తకు, పిల్లలకు తృప్తిగా అన్నం పెట్టింది. కరోనా కాలంలో స్త్రీలు పడే కష్టాలకు శాంతమ్మ పాత్రకు మచ్చుతునక. ఇలా కరోనాకాలంలో

రోజువారి కూలీలైన స్త్రీలు పనులు లేక కుటుంబాన్ని సాకడానికి ఎన్నో దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటూ అనుభవించారని చెప్పడానికి ఈ కథ ఒక చక్కటి ఉదాహరణ.

**వృద్ధ, ఒంటరి మహిళల పరిస్థితి**: కరోనాకాలంలో వృద్ధ, ఒంటరి మహిళలు అనేది ఇబ్బందులను చవిచూశారనే చెప్పాలి. ఒంటరి మహిళలు కాన్పుల విషయంలో, ముఖ్యంగా వలస కూలీలు చాలా అభద్రతాభావానికి గుర్రై, హత్యాచారాలు, దోపిడీలకు గురయ్యారు. ఇటువంటి పరిస్థితులను కరోనా నేపథ్య కథల్లో చూడవచ్చు. శైలజా మిత్ర రాసిన "నడిచేయంత్రం" కథలో కరోనా లాక్ డౌన్ వల్ల సాఫ్ట్వేర్ ఉద్యోగులందరూ ఇల్లకే పరిమితమై వర్క్ ఫ్రం హోం చేస్తూ వారికి కావలసిన భోజనాలు, ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవడానికి, ఇళ్లల్లో ఉన్న పెద్దవారికి (వృద్ధ మహిళలుకు) విశ్రాంతి లేకుండా, కనీసం కంటినిండా కునుకు లేకుండా వారి చేత నడిచే యంత్రంలాగా వెట్టి చాకిరి చేయించుకున్నారు. అనారోగ్య సమస్య తలెత్తినప్పుడు మాత్రం కనీసం పెద్దవారైన మహిళల పట్ల గౌరవం లేకుండా అక్కడనుండి కూతురు, కోడలు కూడా పిల్లలను తీసుకొని వెళ్ళిపోయిన పరిస్థితులు కనబడును. రాఘవరావు, అవంతి దంపతులకు ఒక కొడుకు, కూతురు. వాళ్లంతా సాఫ్ట్వేర్ ఉద్యోగులు. కరోనా లాక్ డౌన్ కారణంగా వర్క్ ఫ్రం హోం పేరుతో కొడుకు, కూతురు పిల్లలతో సహా అందరూ ఒకచోట చేరుకున్నారు. పిల్లల సంరక్షణను పెద్దలకు అప్పగించి ఎవరంిగదుల్లో వాళ్ళు వర్క్ చేసుకుని ఖాళీ సమయంలో టీవీ, ఫోను చూసుకుంటున్నారు తప్ప ఇంటి పనులేవి చేయరు. పనమ్మాయిని కూడా మాన్పించేశారు. వీళ్లందరి పట్ల ప్రేమతో పనులన్నీ విశ్రాంతి లేకుండా చేస్తున్న అవంతికి షుగర్ ఎక్కువై అనారోగ్యానికి గుర్రైంది. డాక్టర్ వెంకటేశ్వరరావు దగ్గరకు వెళ్ళగా 14 రోజులు హోమ్ క్వారంటైన్ లో ఉండి విశ్రాంతి తీసుకోవాలని సూచించాడు. దాంతో ఇంట్లో ఉన్న కొడుకు, కోడలు, అల్లుడు, కూతురు వంటలు వండుకొని పిల్లలను సాకలేక అక్కడి నుండి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు. " మొత్తానికి పది రోజుల్లో ఇంట్లో ఒక్కరూ లేకుండా ప్రయాణమైపోయారు. తాము వండలేకపోతున్నామని, పిల్లల్ని చూసుకోలేకపోతున్నామని ". ( నడిచేయంత్రం -పుట-168) 'మోసేవాడికి తెలుస్తుంది కావిడ బరువు' అన్నట్టుగా అవంతికి ఆర్డర్లు వేసి పని చెప్పే వారంతా కన్నతల్లిని కూడా చూడకుండా ఎవరి మట్టుకు వారు వెళ్ళిపోయారు. కడుపున పుట్టిన పిల్లలే తల్లి వంటింట్లో పడుతున్న కష్టాన్ని గ్రహించకుండా అనారోగ్యానికి గురి చేసిన పరిస్థితులు కానవస్తాయి. పెద్దవాళ్లయిన స్త్రీలు తమ బిడ్డల కోసం ఎంతో ఓర్పుతో ఎన్నో సేవలు చేస్తే చివరకు అనారోగ్యం వస్తే తల్లిని కూడా పట్టించుకోకుండా ఎవరు మట్టుకు వాళ్ళు తన సొంత నివాసానికి వెళ్లిపోయంసేందర్భం ఈకథలో కనిపిస్తుంది.

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

మల్లవరపు విజయ రాసిన "కరోనా కౌగట్లో మనీషా" కథలో ఇళ్లల్లో పనిచేస్తున్న మహిళను కరోనా కారణంగా పనిలో నుండి తీసివేయడంతో వలస వచ్చిన ఆమె తిరిగి సొంతగూటికి చేరుకోవడానికి నడకమార్గంలో ఒంటరిగా ప్రయాణించినప్పుడు గుర్తుతెలియని దుండగులు వాహనం ఎక్కించి తీసుకెళ్లి మత్తించ్చి కిడ్నీ దోపిడీ చేసిన పరిస్థితులు కానవస్తాయి. బోధన్ కు 80 కిలోమీటర్ల దూరంలో నాందేడ్ లో శ్రీమంతుల ఇంట్లో పనికి కుదుర్చారు మనీషాను తల్లిదండ్రులు. కరోనాకాలంలో ఇంటిగలవాళ్ళు పనిమానిపించడంతో మనీషాకు ఏమి చేయాలో, ఎక్కడికి వెళ్లాలో దిక్కు తోచని స్థితి, తీరని విషాదం ఆమెను ఆవరించాయి. ఏమీ చేయలేక తిరిగి ఒంటరిగా బోధన్ కు ప్రయాణమై నడుస్తూ ఆకలితో అలమటిస్తూ, దొరికినది తిని ప్రాణం నిలబెట్టుకుంటూ కొంత దూరం ప్రయాణించేటప్పటికి దగ్గరగా ఒక వాహనం వచ్చి ఆగింది. మనీషాను మోసగించే ప్రయత్నం చేస్తూ వాహనం లోనికి ఎక్కించి అన్ని సౌకర్యాలున్న పెద్ద భవంతికి తీసుకెళ్లారు. అక్కడ తంనే కాఫీ తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లినప్పుడు కిడ్నీ తీసేసి యధావిధిగా కుట్టి తిరిగి బస్టాండ్ లో విడిచిపెట్టారామెను. అయోమయంగా మనీషా నడక ప్రారంభించి నడుస్తుండగా.... " ఎప్పుడూ లేంది ఇప్పుడు తనకు ఆయాసం ఎక్కువవుతుంది. లంగా నుండి ఎందుకో రక్తం బొట్లు బొట్లుగా చిందుతుంది. నడుం వద్ద వేళ్ళతో తడుముకుంది. ఏవో కుట్లు వేసినట్లుగా అనిపించింది. రక్తం అక్కడి నుండి కారుతుంది. నిలువెల్లా భయం కమ్ముకొంది. కంగారు కంగారుగా నాగన్నపల్లి చేరుకొని నిస్సత్తువుగా నేలకూలింది."( కరోనా కౌగిట్లో మనీషా -పుట-317) కరోనా కాలంలో వ్యాధి భయం కంటే దోపిడీదారులు భయమే ఒంటరి మహిళలను బలికొన్న వాస్తవిక సంఘటనలు సాక్షిభూతమగును. దుండగుల దాష్టీకత్వానికి బలైపోయిన మహిళ చివరకు సొంతగూటికి చేరికోకుండానే విధి వక్రీకరించడంతో మరణించి తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చిన సందర్భాలెన్నో ఉన్నాయని చెప్పడానికి ఈ కథలో మనీషా పాత్ర ఒక చక్కటి ఉదాహరణగా చెప్పవచ్చు.

ఐనంపూడి శ్రీలక్ష్మి రాసిన "ఆకలి" కథలో బతుకుతెరువు కోసం వలస వెళ్లిన ఒంటరి మహిళలు కరోనా వల్ల పట్టణాల్లో పనులు లేకపోవడంతో తిరిగి పల్లెలకు వస్తున్న సమయంలో మార్గమధ్యంలో ఆకలి దప్పికలుతో బాధపడటం ఒకత్తెయితే, మానవ మృగాలు ఒంటరి మహిళలను చెరపట్టి వారిని అత్యాచారాలు చేసిన సంఘటనలు మరొక పక్క కనిపించును. కరోనా వల్ల లాక్ డౌన్ విధించడంతో ముఖ్యంగా వలస కూలీల జీవనోపాధిని కోల్పోయారు. ఒంటరి మహిళలు తిరిగి పల్లెలకు చేరుకోవడానికి నడక మార్గంలో ఆకలితో అలమటిస్తున్న పిల్లలను చంకలో వేసుకొని ఎక్కడో దొరికిన ఇంత ముద్దతో ప్రాణాన్ని నిలుపుకొని, రాత్రిపూట ఎవరో ఇచ్చిన ఆశ్రయంలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు వెకిలిగా

ISSN:3048-5908 Impact Factor:6.673(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

రంగడు వంటి కామాంధుడు ఆమెను అనుసరిస్తూ వచ్చి వగరుస్తూ ఆమెపట్ల దాష్టీకత్వంతో ప్రవర్తించిన తీరు అగుపించెను. " ఏడాది నుండి నీ మీద కన్నేశానే..... నీ మొగిడిని చూసి భయపడినా.... వాడు యాక్సిడెంట్లు చచ్చిండు కదా నాలుగు నెలల కిందట... అప్పటినుండి ఎప్పుడెప్పుడు నిన్ను పొందుదామా అని ఎదురుచూస్తున్నా.... నాతోవుండు ఇంత అన్నం పెడ్తా... నీ బిడ్డని చూస్కుంటా అన్నాడు వాడు వగరుస్తూ...."( ఆకలి- పుట- 290) రంగడు ఆమె పట్ల ప్రవర్తించే మోసాన్ని గ్రహించి న ఆ మహిళ పొమ్మని తిరస్కరించి, బిడ్డను పట్టుకొని పారిపోతుండగా మరొకడు సాయంగా వచ్చి ఎలాగైనా ఆమెను పొందాలనుకొని... " పట్టుకో దాన్ని పట్టుకో అని అరిచాడు రంగడు వగరుస్తూ... సూపర్వైజర్ కూడా నిండా తాగి ఉన్నాడు. నన్ను పట్టుకోబోయి తూలాడు. తమాయించుకుని నారైక లాగాడు. రంగడొచ్చి వాడిని తోస్తూ... ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న దీనికోసం... ముందు నా వంతే అన్నాడు. ( ఆకలి- పుట - 291) మానవ మృగాల వంటి వాళ్ళు పిల్లను కూడా హింసించడం దాష్టాకత్వానికి ప్రత్యేక. వలస జీవులైన ఒంటరి మహిళలు సొంతగూటికి చేరుతున్న సమయంలో రంగడు వంటి కామాంధులు చెరపట్టి, చుట్టుముట్టి హత్యాచారయత్నాలు చేసిన పరిస్థితిలను చాలామంది మహిళలు ఎదుర్కొన్నారని చెప్పడానికి ఈ కథ ఒక చక్కటి ఉదాహరణ.

**ముగింపు :** కరోనా స్త్రీల జీవితాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. గృహిణులు, ఉద్యోగినులు, దినసరి కూలీలు, వలస కూలీలు, వృద్ధ, ఒంటరి మహిళలు మొదలైన వివిధ వర్గాలకు చెందిన మహిళలు శారీరిక, మానసిక, ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ వారు కుటుంబాన్ని కాపాడుతూ, పిల్లలు, వృద్ధుల సంరక్షణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ధైర్యం,సాహసం, త్యాగం మరియు ఆత్మ విశ్వాసాన్ని ప్రదర్శించారు. ఈ అనుభవాలు భవిష్యత్తులో మహిళ భద్రత, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక సంరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేసాయి. అందువల్ల మహిళా సాధికారతను పెంపొందించే విధానాలు అమలు చేయడం సమాజాభివృద్ధికి అత్యంత అవసరంగా చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు**

కోవిడ్-19 మహమ్మారి మరియు సమాజంపై ప్రభావాన్ని విశ్లేషించే తెలుగు కథా సంకలనాలు.
కరోనా కాలంలో స్త్రీల జీవన పరిస్థితులను ప్రతిబింబించే తెలుగు కథలు.
స్త్రీవాద సాహిత్యం, స్త్రీల సామాజిక స్థితిగతులకు సంబంధించిన తెలుగు విమర్శా గ్రంథాలు.
కరోనా కాలంలో మహిళల సామాజిక, ఆర్థిక, కుటుంబ సమస్యలకు సంబంధించిన పరిశోధనా వ్యాసాలు.

ISSN:3048-5908
Impact Factor:6.673(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-3, (July/Aug/Sept), 2026

తెలుగు సాహిత్యంలో స్త్రీల చిత్రణకు సంబంధించిన విమర్శా గ్రంథాలు.